క్లుప్తంగా

మారుతి కార్లు, హోండా బైకు లోన్, ఎక్చేంజ్ మేళా



నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్సీ మైదానంలో భార్గవి ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మారుతి కార్లు, శ్రీషిర్డీ హోండా షోరూం ఆధ్వర్యంలో హోండా బైకులు, స్కూటీల లోన్ అండ్ ఎక్చేంజ్ మేళాను బుధవారం నిర్వహించారు. ఈ మేళాకు ఏపీఐఐసీ డిప్యూటీ డైరెక్టర్ బ్రహ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దసరా సందర్భంగా మారుతి కార్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు, ఎక్చేంజ్ బోనస్ అందించడం సంతోషకరమన్నారు. భార్గవి ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అరెనా కార్ల మోడళ్లపై రూ. 41 వేల నుంచి రూ.61 వేల వరకు, నెక్సా మోడళ్ల కార్లపై రూ. 30వేల నుంచి రూ. 60 వేల వరకు ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు. స్క్రాచ్ కార్డుపై గోల్డ్ లేదా సిల్వర్ కాయిన్లను అందిస్తున్నామన్నారు. హోండా బైకులకు సంబంధించి రెడ్ వింగ్ మోడల్స్‌పై రూ.2,300, బిగ్‌వింగ్ మోడల్స్‌పై రూ.5వేలు ఆఫర్లు అందిస్తున్నామన్నారు. రెండ్రోజుల పాటు నిర్వహించే మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భార్గవి ఆటోమొబైల్స్ సీజీఎం రవికుమార్, జీఎం శ్రీనివాస్, ట్రూవాల్యూ మేనేజర్ వేణు, సేల్స్ మేనేజర్లు రమేష్, మస్తానయ్య, లక్ష్మణ్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలికా దినోత్సవానికి సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆడపిల్లలపై చూపుతున్న వివక్షత, హింస, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీఈఎంఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ లింగ నిష్పత్తి, సమతుల్యత లోపించడంతో కలిగే అనర్థాలు, బాలికా చట్టాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ శిరీషా మాట్లాడుతూ బాలల సంరక్షణ, దివ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చైతన్య వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, డిప్యూటీ డీఈఎంఓ కనకరత్నం, జీసీడీఓ మమత, ఐటీడీఓ జీసీడీఓ శాంతి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులకు సూచించారు. నగరంలోని 18వ డివిజన్ హరినాథపురంలో బుధవారం ఉదయం అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను సాధించాలి

కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, కుళాయి, కమర్షియల్ భవనాల పన్నుల బకాయిల వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో బుధవారం ఆయన సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడ్మిన్ కార్యదర్శులందరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య సేవలు అర్హులందరికీ అందించేందుకు కృషి చేయాలన్నారు. అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు గుర్తింపు కార్డుల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 650 మందికిపైగా వాకర్స్‌కు ఇంటర్నేషనల్ గుర్తింపు కారులను బుధవారం పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్, చిల్డ్రన్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శింగంశెట్టి మురళీమోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కేక్ కట్ చేసి వాకర్స్‌కు గుర్తింపు కార్డులు అందజేశారు. నేతాజీ సుబ్బారెడ్డి, వెంకటాద్రిరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, బొగ్గవరపు శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



ఎంపీ విజయసాయిరెడ్డితో సమావేశమైన తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి



పార్టీ సమీక్ష సమావేశం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, పక్కన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ సమీక్ష సమావేశాల నిమిత్తం నెల్లూరుకు బుధవారం విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న పార్టీ సమీక్ష సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ స్వాగతం పలికారు. తొలుత వీపీఆర్ కన్వెన్షన్ సెంటరుకు విచ్చేసిన విజయసాయిరెడ్డి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయసాయిరెడ్డితో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మరమ్మత్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జయవర్ధన్ దంపతులు, డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్ యాదవ్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, లంకా రామశివారెడ్డి, పాముల రమణయ్య, శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వైవీ రామిరెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, కలికి శ్రీధర్‌రెడ్డి, ఎస్ఆర్ ఇంతియాజ్, ద్వారకానాథ్‌రెడ్డి, నిచ్చల్‌రెడ్డి, ఇందూధర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి , హాజీ మర్యాదపూర్వకంగా కలిశారు.

రెండ్రోజుల పాటు సమీక్ష సమావేశాలు.


జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో విజయసాయిరెడ్డి రెండ్రోజుల పాటు సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కోవూరు, 11.30 గంటలకు నెల్లూరు రూరల్, మధ్యాహ్నం 2 గంటలకు కందుకూరు, 3.30 గంటలకు ఆత్మకూరు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులతో సమావేశం నిర్వహించనున్నారు.



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముక్కాల, రూప్‌కుమార్



మెట్టుకూరి ధనుంజయరెడ్డి



కొడవలూరు ధనుంజయరెడ్డి



దుగ్గిరెడ్డి గురవారెడ్డి



విజయసాయిరెడ్డికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మేయర్ స్రవంతి దంపతులు

దసరాకు దూరప్రాంతాలకు 86 బస్సులు సిద్ధం

నెల్లూరు సిటీ: దసరా పండగకు పీటీడీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా నుంచి రాకపోకలకు దాదాపు 86 బస్సులను సిద్ధం చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారు. ప్రయాణికులు తమ టికెట్లను ముందుగానే రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి శేషయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్) : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్య శిక్షణ కేంద్రం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఆటోస్పైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, ఇన్నోవా సోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్, వీల్స్ ఇండియా లిమిటెడ్, అపోలో ఫార్మసీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమర రాజా బ్యాటరీస్, వరుణ్ మోటార్స్ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లొమో, బీఫార్మసీ, బీటెక్ చదివిన వారు ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డీకేడబ్ల్యూ కళాశాలలో ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఉద్యాన వనాలను సుందరంగా తీర్చిదిద్దాలి

• మేయర్ పొట్లూరి స్రవంతి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఉద్యాన వనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని మేయర్ పొట్లూరి స్రవంతి కార్పొరేషన్ అధికారులకు సూచించారు. బుధవారం మేయర్ తన ఛాంబర్‌లో కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. డివైడర్లు, ఉద్యానవనాల సుందరీకరణపై సమీక్షించారు. నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని, మొక్కలు ఎండిపోకుండా డ్రిప్, స్ప్రింకర్ల సాయంతో నీటిని అందించాలని సూచించారు. పశువుల నుంచి మొక్కల రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన రహదారుల మధ్య ఉన్న డివైడర్లలో అవసరమైన చోట మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలకు చైతన్యం కల్పించే దిశగా ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, ప్రజలు ప్రత్యక్షంగా భాగస్వాములయ్యేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, ఈఈ ప్రసాద్, డీఈ ప్రసాద్, ముజహిద్దీన్, ఏఈ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

నెల్లూరు రూరల్: సేవాజ్యోతి కాలనీలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని జిల్లా కుష్టు నివారణాధికారి, అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి అన్నారు.ఆమంచర్లలోని సేవాజ్యోతి కాలనీని బుధవారం ఆయన సందర్శించారు. కుష్టు రోగుల జీవన స్థితిగతులు, ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. వైద్యపరంగా అన్ని సేవలు అందిస్తామని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కవిత, సిబ్బంది నరసింహులు, షంషుద్దీన్, పెంచలయ్య, కామాక్షి, పఠాన్ మస్తాన్, తదితరులు ఉన్నారు.

29న నూర్‌బాషాల సింహగర్జన



సింహగర్జన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూర్‌బాషాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో తమకు అవకాశం కల్పించే పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. జిల్లాలోని నూర్‌బాషాలు సింహగర్జన సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సంఘ నాయకులు ఖాదర్‌బాషా, బాబర్జన్, మౌలాలి, మస్తాన్, షకీరా,షరీఫ్, ఖాజావలి, లతీఫ్, మస్తాన్‌వలి, బీబీజాన్, తదితరులు పాల్గొన్నారు.

'మార్టిన్ లూథర్ కింగ్' ప్రీమియర్ షో



ప్రేక్షకులతో మాట్లాడుతున్న సినీ హీరో సంపూర్ణేష్‌బాబు

నెల్లూరు సిటీ: ఈ నెల 27న విడుదల కానున్న 'మార్టిన్ లూథర్‌కింగ్ చిత్రం ప్రీమియర్ షోను నగరంలోని ఎంజీబీ మాల్‌లోని స్పైస్ థియేటర్‌లో బుధవారం ప్రదర్శించారు. చిత్ర హీరో సంపూర్ణేష్‌బాబు, దర్శకురాలు కొల్లు పూజ, నెల్లూరు కళాకారులు నీరజ, పవన్, రమేష్‌తో పాటు కంచరపాళెం చిత్ర దర్శకుడు వెంకటేష్ మహా హాజరై ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో సంపూర్ణేష్‌బాబు మాట్లాడారు. చిత్రంపై తమకు ఉన్న నమ్మకంతో విడుదలకు ముందే ప్రేక్షకులకు ప్రీమియర్ షో వేశామని తెలిపారు. చిత్ర దర్శకురాలు మాట్లాడుతూ చిత్ర ప్రచారంలో భాగంగా కొత్త ఆలోచనతో ముందుగా ప్రీమియర్ షో వేశామని తెలిపారు. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల 27న రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానున్న తమ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు.25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): స్నేహితులను బైక్‌పై ఇంటికి తీసుకెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన భగత్‌సింగ్‌కాలనీ మలుపు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. శెట్టిగుంటరోడ్డుకు చెందిన కృపావరం (20), రామకోటయ్యనగర్‌కు చెందిన శేఖర్ సీతురాజు, ప్రగతినగర్‌కు చెందిన మౌలాలీ స్నేహితులు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్‌గా కృపావరం పనిచేస్తుండగా.. మిగిలిన ఇద్దరూ రొయ్యల వ్యాపారం సాగిస్తున్నారు. వ్యాపార పనుల నిమిత్తం శేఖర్, మౌలాలీ ఆత్మకూరు వెళ్లి భగత్‌సింగ్‌కాలనీకి మంగళవారం రాత్రి వచ్చారు. అక్కడి నుంచి ఇంటికెళ్లేందుకు వాహనం లేకపోవడంతో కృపావరానికి ఫోన్ చేశారు. బైక్‌పై జాతీయ రహదారి మీదుగా భగత్‌సింగ్ కాలనీ వద్దకు కృపావరం వెళ్తుండగా, మలుపు వద్ద స్నేహితులు ఎదురయ్యారు. దీంతో వారిని బైక్‌పై ఎక్కించుకొని యూటర్న్ తీసుకుంటుండగా, చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఘటనలో కృపావరం తీవ్రంగా, శేఖర్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సహకారంతో వారిని చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో హాస్పిటల్‌కు మౌలాలీ తరలించారు.. పరీక్షించిన వైద్యులు అప్పటికే కృపావరం మృతి చెందారని నిర్ధారించారు. దీంతో విషయాన్ని మృతుడి తండ్రి విజయ్‌కు మౌలాలీ తెలియజేశారు. హాస్పిటల్‌కు చేరుకున్న ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి జరుగనున్న 49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు నగర మేయర్ పొట్లూరి స్రవంతిని ఆలయ ప్రతినిధులు ఆహ్వానించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మేయర్‌కు ఆలయ చైర్మన్, ఈఓ, ప్రధానార్చకుడు, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: ప్రభుత్వ వైద్య కళాశాల నందు నోటిఫికేషన్ ద్వారా ఒక్క సంవత్సరం తాత్కాలిక పద్ధతిలో సీనియర్ రెసిడెంట్లను ఎస్ఎస్‌సీయూ (పీడియాయాట్రిక్స్) విభాగంలో నియమించుకుంటున్నట్లు అడిషనల్ డీఎంఈ అండ్ ప్రిన్సిపల్ వసుంధరాదేవీ బుధవారం ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు ప్రభుత్వ కళాశాలలో 16వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు 'వాక్ ఇన్ ఇంటర్వ్యూ' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వేడుకగా 'నా భూమి–నా దేశం'



సేకరించిన మట్టిని భద్రం చేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

ఈనెల్లూరు(బారకాసు): ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. కేంద్ర సాంస్కృతిక, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆదేశాల మేరకు రెండో విడత 'అమృత కలశ యాత్ర'ను రూరల్ నియోజక వర్గ పరిధిలోని గోమతినగర్ పార్కు, నగర నియోజకవర్గ పరిధిలోని పెన్నా బ్యారేజ్ సమీపంలోని తిక్కన పార్కులో నిర్వహించారు. వార్డుల నుంచి సేకరించిన అమృత కలశాలు, మట్టిని రెండు పెద్ద అమృత కలశాల్లో నింపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం విశ్రాంత సైనికులను ఘనంగా సత్కరించారు. నగర పాలక సంస్థ రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వామ్యంతో వేడుకలను ఘనంగా నిర్వహించామని కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి వాసవీమాత శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ముక్కాల

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ ఆలయ ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం 6.30 గంటలకు కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. తొలిరోజు భవానీగా అమ్మవారు భక్తులను కటాక్షిస్తారని తెలిపారు. 16న బాలత్రిపురసుందరి అలంకారం, మూలవరులకు చందనాలంకారం, 17న అన్నపూర్ణాలంకారం, మూలవరులకు 600కిలోల మిఠాయిలతో అలంకారం, 18న రాజరాజేశ్వరి అలంకారం, మూలవరులకు లక్ష గాజుల అలంకారం, 19న గాయత్రి అలంకారం, మూలవరులకు ముత్యాల చీరతో అలంకారం, 20న సరస్వతి అలంకారం, 21న ధనలక్ష్మి అలంకారం, మూలవరులను 500 కిలోల వెండిపట్టీలతో అలంకరించనున్నట్లు వివరించారు. 22న దుర్గాష్టమి నాడు దుర్గాదేవి అలంకారం, మూలవరులకు 40వేల నిమ్మకాయలతో అలంకారం, 23న మహర్నవమి నాడు ఉదయం 9గంటలకు కన్యపూజ, రాత్రి గజలక్ష్మి అలంకారం, మూలవరులను మహిషాసురమర్దినిగా అలంకరించనున్నట్లు చెప్పారు. 24న విజయదశమి నాడు ఉదయం 11గంటలకు శమీపూజ, సాయంత్రం 6గంటలకు అమ్మవారి నగరోత్సవం విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 25న ఉదయం 10గంటలకు వసంతోత్సవం, రాత్రి దర్బార్ అలంకారం, మూలవరులకు మల్లెపూల అలంకారం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు శ్రీరాంసురేష్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన వధూవరులకు అమ్మవారి సన్నిధిలో ఎటువంటి రుసుం లేకుండా వివాహం చేసుకునే వెసులుబాటుతో పాటు దంపతులకు పట్టువస్త్రాలను అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధర్మకర్తల మండలి కార్యదర్శి సోమిశెట్టి రమేష్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పేర్ల జనార్ధన్‌రావు, సభ్యులు కల్యాణి, ఎం కామేశ్వరరావు, బీ వెంకటరాజగోపాల్, ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

శంకరమఠంలో..

మూలాపేటలోని శంకరమఠంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు బుధవారం తెలిపారు. నిత్యం అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిస్తారని తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగి మృతికి సంతాపం



పద్మావతి (ఫైల్)

నెల్లూరు (లీగల్): నెల్లూరు లోక్ అదాలత్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న పెండ్యం పద్మావతి బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమె విధులు నిర్వహిస్తూ ఒక్కసారిగా స్పృహ కోల్పోయింది. వెంటనే సహచర ఉద్యోగులు ఆమెను మెడికవర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతిపై జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణరెడ్డి, శివకుమార్ సంతాపం తెలిపారు.